తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## నేడు 4వ విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ నిధులు జమ

- జిల్లాలో 4.39 లక్షల మహిళలకు రూ.50.34 కోట్లు లబ్ది
- కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ సున్నా వడ్డీ నాల్గవ ఏడాది నిధులను శుక్రవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుండి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం ద్వారా 34,286 స్వయం సహాయక మహిళా సంఘాల్లో వున్న 4,39,958 మహిళలకు 50.34 కోట్ల రూపాయలు మహిళలైన లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.

## సామాన్యుడు.... ఉద్యోగుల వైపు ఉంటా

- ◆ధనవంతుడికి సేవ చేయడానికి పదవి చేపట్టలేదు
- ◆స్వామి భక్తుడిని అనుగ్రహించే క్షణకాల దర్శనం చాలు
- ◆టిటిడి నూతన ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు







తిరుమల, ఆగస్టు 10ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి లక్షమంది భక్తులు వస్తున్నారని, సామాన్యభక్తులకు సేవచేసేందుకు తన మొదటి ప్రాధాన్యత అని టిటిడి నూతన ఛైర్మన్ కరుణా కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ధనవంతులకు ఊడిగం (సేవ)చేయడానికో...వారికి ప్రాధాన్యతనివ్వ డానికో టిటిడి ఛైర్మన్ పదవి చేపట్టలేదని కీలక వ్యాఖ్యలు చేశారు. దేవుడిని ఎక్కువ సమయం దర్శించుకోవడం కాదని, స్వామివారు భక్తుడిని అనుగ్రహించే క్షణకాల దర్శనం లభిస్తే చాలన్నారు. సామాన్యభక్తుడినైన నన్ను ఆ స్వామివారు అనుగ్రహించి ఈ పదవిని ఇప్పించారని విశ్వాసం వ్యక్తం చేశారు. టిటిడి ధర్మకర్త మండలి అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి చేత గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలో గరుడాళ్వార్ సన్నిధిలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 ద్వారా వచ్చిన ఆయనకు మహాద్వారం వద్ద ఇఒ ధర్మారెడ్డి, తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.సామాన్యభక్తులకు మంచిజరిగేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సామాన్యుడి వైపు, టిటిడి ఉద్యోగుల వైపు ఉంటానన్నారు. అప్పుడు తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుతం కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పాలకమండలి అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం నాకు ఒక్కడికే దక్కిందన్నారు. తాను స్వామివారి సేవకులకు సేవకునిగా పనిచేస్తానని, అధికారం కోసం కాదని అన్నారు. స్వామివారిని భక్తుల దగ్గరకు తీసుకెళ్ళి భక్తిప్రసాదం పంచుతామన్నారు. అంతకుముందు ఛైర్మన్‌గా భూమన కరుణా కర్‌రెడ్డి కుటుంబంతో కలసి శ్రీవారి ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభం మొక్కా రు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతి నగరపాలకసంస్థ మేయర్ డాక్టర్ శిరీష, మంత్రులు రోజా,అంబటి రాంబాబు,ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,జంగాలపల్లి శ్రీని వాసులు, టిటిడి జెఇఒలు సదాభార్గవి,వీరబ్రహ్మం,తిరుపతి కమిషనర్ హరిత పాల్గొన్నారు.

# కమనీయం...కార్తీకేయుని తెప్పోత్సవం

-పులకించిన భక్తజనం





నారద పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న కార్తీకేయుడు, తెప్పోత్సవానికి హాజరైన భక్తజనం

శ్రీకాళహస్తి, ఆగస్టు 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి బాబుఅగ్రహారం వద్ద ఉన్న నారదపుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కన్నులపండువగా సాగింది. సాధారణంగా ఉత్సవాల్లో బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. అయితే దేవాదాయశాఖ కమి షనర్ ఉత్తర్వులతో బాణసంచాను నిషేధించారు. దేవస్థానం అధికా రులు, పోలీసులు ముందుజాగ్రత్తగా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే గతంతో పోల్చుకుంటే తెప్పోత్సవానికి జనం బాగా తగ్గారు. ఉత్సవాల్లో అలంకారాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలయం నుంచి రాత్రి వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని శూలం పూల అలంకారాల్లో ఊరేగింపుగా తెచ్చారు. పట్టణంలోని తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి నుంచి నారదపుష్కరిణికి స్వామి అమ్మవార్లను చేర్చారు. అక్కడ తయారు చేసిన తెప్పలో ప్రతిష్టించారు.

**కన్నుల పండువగా . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఉత్సవాల్లో మహాశివరాత్రికి, ఆడి కృత్తికకు నారదపుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించటం ఆన వాయితి. మహాశివరాత్రికి రెండు, ఆడికృత్తికకు ఒక తెప్పను రూప కల్పన చేస్తారు. ఉత్సవాలకు భక్తుల భక్తి భావం పెరుగుతుంది. ఎం చక్కా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి తీసుకొచ్చిన స్వామి అమ్మవార్లను తెప్పల్లో ప్రతిష్టించారు. ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెప్పోత్సవంకు సంబంధించి సమీక్షించారు.

**తెప్పోత్సవం:**

ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్, పర్యవేక్షణలో వేదపండితులు వేదమంత్రాల్ని వేదమంత్రాల్ని పఠిస్తుండగా తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. ఇక్కడి ఉత్సవాలకు సంబంధించి డివైయస్‌పి బీమారావు, సిఐలు విక్రమ్, మల్లికార్జున, అజయ్‌కుమార్‌లు వారి సిబ్బంది చక్కగా బందోబస్తును నిర్వహించారు. కాగా ఇటు

## చంద్రయాన్-3 పనితీరు అద్భుతం

- భూమి ఫొటోను అందంగా తీసి పంపించిన కెమెరా





జూలై 14న ల్యాండర్ ఇమేజ్ కెమెరా చిత్రీకరించిన భూమి ఫొటో
ఆగస్టు 6న ఎల్‌హెచ్‌విసి కెమెరా తీసిన చంద్రుని ఫొటో

శ్రీహరికోట (తడ), ఆగస్టు 10 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్ అద్భుత పనితీరును ఆస్వాదిస్తోంది. గత నెల 14న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 ఉపగ్రహం ఇప్పటికే పలు మార్లు ఫొటోలు తీసి భూకేంద్రా లకు పంపించి ఉంది. అయితే తాజాగా ఇస్రో మరో రెండు అత్యద్భుత ఛాయాచిత్రాలను విడుదల చేసింది. ఇందులో ఒకటి రాకెట్ ప్రయోగం జరిగిన రోజు అందులోని ఆన్‌బోర్డు కెమెరా ఒక చిత్రాన్ని తీసి భద్రపరిచి ఇప్పుడు పంపించింది. వెళుతూ వెళుతూ ఎల్‌విఎం3 బాహుబలి రాకెట్‌లో అమర్చిన ల్యాండర్ ఇమేజర్ కెమెరా తీసిన భూమి ఫొటో ఇది. ఆ తర్వాత ఈ నెల 6న చంద్రయాన్-3 చంద్రుని చుట్టూ పరిభ్రమిస్తున్నప్పుడు చంద్రుని ఇంకో భాగాన్ని చిత్రించి పంపించింది. చంద్రయాన్-3లో ప్రవేశపెట్టిన అత్యంత శక్తివంతమైన ల్యాండర్ హారిజంటల్ వెలాసిటి కెమెరా (ఎల్‌హెచ్‌విసి) ఈ ఛాయాచిత్రం తీసింది. ప్రస్తుతం ఇస్రో వీటిని అధికారికంగా ప్రకటించింది.

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పంచాయతీ నిధుల మళ్లింపు

- కలెక్టరేట్ ఎదుట బిజెపి ఆధ్వర్యంలో మహాధర్నా

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాజ్యంగ స్ఫూర్తికి విర్దుద్దంగా మళ్ళించి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగకుండా అడ్డుకొంటుందని జిల్లా బిజెపి అధ్యక్షుడు జిల్లా బిజెపి అధ్యక్షుడు రామచంద్రుడు, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబులు ధ్వజమెత్తారు. కలెక్టరేట్ ఎదుట గురువారం బిజెపి, జనసేన ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా బిజెపి అధ్యక్షుడు రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా పంచాయతీలకు 6,950 కోట్ల రూపాయల నిధులను 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా విడుదల చేసిందని, అయితే గ్రామ పంచాయతీల సర్పంచ్



ఖాతాల నుండ ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్ళించి గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకొందని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లుగా గెలిచిన వారు ఎలాంటి అభివృద్ధి చేయలేని పరిస్థితుల్లో వున్నారని, కొన్ని పంచాయతీల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్‌లు ఆ నిధులు సైతం తిరిగి ఇవ్వలేని పరిస్థితుల్లో వున్నారని ధ్వజమెత్తారు. ఇకపై ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా పంచాయతీలకు జమ కావాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటి వరకు పంచాయతీ నిధులను వాడుకొన్న రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకగ్రీక పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు సత్వరం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు రామచంద్రుడు, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్, జనసేన నాయకులు దయారం, ప్రసాద్, యశ్వంత్, యుగంధర్, బిజెపి సీనియర్ నాయకులు నారాయణస్వామినాయుడు, సుబ్రమణ్యాయాదవ్, ఈశ్వర ప్రసాద్, నిషిధరాజు, జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాస్, కడియాల సురేష్, రాజేంద్రన్, మణివర్మ తదితరులు పాల్గొన్నారు.

## శరీరానికి ముళ్లుగుచ్చుకొని క్రేన్‌లపై వ్రేలాడుతూ భక్తుల విన్యాసాలు..!

నారాయణవనం, ఆగస్టు 10 ప్రభాతవార్త :



మండల కేంద్ర ంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం ఉదయం స్థానికంగా మొక్కుబడి కలిగిన భక్తులు శరీరం వెనుకవైపు ముళ్ల గుచ్చుకోని క్రేన్, జెసిబి, లారీలు, ట్రాక్టర్, ఆటోలను లాగడం, వ్రేలాడడం భక్తులను మరింతంగా ఆకట్టుకుంది. ప్రతిఏడాది వన్నిరెడ్డి కులానికి చెందిన యువకులు మొక్కుబడితో ఈ విన్యాసాలను చేయడం ఆనవాయితీగా వస్తున్నది. సాయంత్రం అమ్మవారు, ధర్మరాజులస్వామివారిని సర్వభూపాల వాహనంపై అధిరోహించి నారాయణవనం, సముదాయం గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు వన్నిరెడ్డి కులస్థుల పెద్దల ఆద్వర్యంలో భారీపూలమాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారిని, స్వామివారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించిన తర్వాత పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా టెంకాహారుతులు సమర్పించుకున్నారు. అంతకుముందు ఉదయం సముదాయం గ్రామంలో స్వామి,అమ్మవారిని ఊరేగించారు. భక్తులు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, మాజీ ధర్మకర్త దేశప్పరెడ్డి, వన్నిరెడ్డి కులపెద్దలు కెఎస్.రవిరెడ్డి, గోపిరెడ్డి, శరవణ, సొరకాయులు, టి.శ్రీరాములురెడ్డి, సముదాయం గ్రామస్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో ఎన్నికల ఉద్రిక్తత

### బైఠాయించిన దేశం నాయకులు

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్),ఆగస్టు 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు కొందరు అధికార పార్టీ కార్యకర్తల్లా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేసినట్లు వ్యవహారిస్తున్నారని కానీ రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వం అని మూల్యం చెల్లించుకోక తప్పదని శ్రీకాళహస్తి తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారంమండలంలోని పెనుమల్లం పంచాయతీ ఉప ఎన్నికలకు గురువారం నామినేషన్ వేయటానికి గిరిజనమహిళలు వెళ్ళగా పోలీసుల సహాకారంతో రిటర్నింగ్ అధికారి నామినేషన్‌పత్రాలను అధికార పార్టీ నాయకుల డైరెక్షన్‌లో చేయటం తగదని సుధీర్‌రెడ్డి హెచ్చరించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాసనసభ్యుని అరాచకానికి పరాకాష్ట చేరిందన్నారు. ప్రభుత్వం మంచిపనులు చేసి ప్రజల గుండెల్లో గూడుకట్టుకొని ఉంటే ఎన్నికలకు భయమెందుకు? అని ప్రశ్నించారు. పారదర్శక పాలన అందించే వారు ఎన్నికలకు ఎందుకు భయపడాలి? ప్రజాస్వామ్యబద్దంగా పోరాడుదాం. ప్రజలు మమ్మల్ని తిరస్కరిస్తే తిరస్కరించనివ్వండి అని సుధీర్‌రెడ్డి అన్నారు.ప్రజలు ఇచ్చిన డబ్బులతోజీతాలు తీసుకుంటూ తామే పార్టీ కార్యకర్తలుగా ఏర్పేడు పోలీసులు వ్యవహారించటం శోచనీయం అన్నారు.నామినేషన్లను చించి అభ్యర్థులను ఎత్తుకెళ్ళిన వైసిపి గూండాల గురించి తాను ఎస్‌పికి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేసామన్నారు.ఒక సారి నామినేషన్‌వేయటానికి వెళ్ళగా చించేసిన అధికారులు, తరువాత వెళ్ళితే సమయం దాటిందని పోలీసులే అడ్డుకోవటం గమనిస్తే వీళ్ల పోలీసులా? వైకాపా కార్యకర్తలా? అని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు.పైగా చంద్రబాబునాయుడును అనుచిత వ్యాఖ్యాలు చేయటం గమనిస్తున్నామని వివరించారు.అందోళనలో తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహాయాదవ్,రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి, చెంచయ్యనాయుడుల సారథ్యంలో ధర్నా జరిపి డి వై యస్ పికి వినతి పత్రం అందించారు.

షాదీమహల్ నిర్మాణంపై

## మంత్రి రోజా సంతృప్తి

పుత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త



: పట్టణంలో రూ. 1.85 కోట్లతో తలపెట్టిన షాదీ మహల్ నిర్మాణ పనులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్, నగరి నియోజకవర్గ మైనార్టీ నాయకుడు వి.ఎం.మాహీన్ మాట్లాడుతూ అటు తాజ్‌మహల్, ఇటు చార్మినార్‌కు మధ్య వుండేలా ఆర్కిటెక్చర్‌తో షాదీమహల్‌ను వినూత్నమైన డిజైన్‌తో నిర్మించామని తెలిపారు. దాదాపుగా 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. డిజైన్, నిర్మాణ పనుల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా షాదీమహల్ పైన ఆరు గదుల నిర్మాణంతో పాటు ఆవరణలో సెప్టిక్ ట్యాంక్ తదితర నిర్మాణాలకు అంచనాలు రూపొందించి నివేదిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే షాదీమహల్ నిర్మాణానికి పెండింగ్‌లో వున్న నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. మంత్రి వెంట పుత్తూరు మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్, వైకాపా నాయకుడు అన్నా లోకనాథం, మైనార్టీ నాయకులు షబ్బీర్, అల్తాఫ్, అయాజ్ అమీన్, సలీమ్, జాకీర్, ఫరూక్, మునాఫ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చెన్నారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ సత్యనారాయణరెడ్డి, డిఇఇ వినోద్‌కుమార్, జెఇ వీరయ్య, ఎఇ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## అల్బెండజోల్ మాత్రల పంపిణీకి డిఎంహెచ్ఓ శ్రీకారం

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:



పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడం తల్లిదండ్రుల కర్తవ్యమని, భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యవంతంగా తయారైతే వారిలో నైపుణ్యాభివృద్ధి పెరుగుతుందని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి పిలుపు నిచ్చారు. ఆరోగ్య సమాజ ఆవిష్కరణలో భాగంగా గురువారం డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో గిరింపేట మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ 400 ఎంజి మాత్రల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మేయర్ అముద అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి మాట్లాడుతూ ప్రతి ఏడాది వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, ఆగస్టు 10వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1-19 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలకు అల్బొండజోల్ 400 ఎంజి మాత్రలు ఈ రోజుల్లో మింగించడం జరుగుతున్నదన్నారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా వుండటానికి ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఇందు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుగురు ఎర్రస్మగ్లర్లు అరెస్టు

### 32 దుంగలు, రెండు కార్లు స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజిలో రెండు వేర్వేరు కేసుల్లో 32 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. రేణిగుంట మండలం కరకంబాడి ప్రాంతంలో ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసుల వివరాలను డిఎస్పి చెంచుబాబు గురువారం తెలిపారు. కర్నూలు రేంజి డిఐజి సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పి చెంచుబాబు ఆధ్వర్యంలో మూడు టీమ్‌లు బుధవారం కూంబింగ్ చేపట్టారు. ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐలు పి. నరేష్, లింగాధర్ టీమ్‌లు అన్నమయ్య జిల్లా సానిపాయ నుంచి కూబింగ్ చేపట్టారు. రాయవరం సెక్షన్‌లోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టగా, శేషాచలం ఎక్స్ టెన్షన్ రిజర్వు ఫారెస్టులో కొందరు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి అక్కడున్న 10 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు తాలూకాకు చెందిన టి. వెంకటేషన్ (26), హరి (46), చిత్తూరు జిల్లా కోట మండలానికి చెందిన కేసీ విజయకుమార్ (33)లను అరెస్టు చేసారు. మరో కేసులో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి టీమ్‌లోని ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్, విశ్వనాథ్ టీమ్‌లు సానిపాయ రేంజిలోని వానరాచపల్లి పారెస్టు బీటులో కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళ్తూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టగా వారు దుంగలను పడేసి పారిపోయారు. అయితే ముగ్గురిని పట్టుకోగలిగారు. వారిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు ప్రాంతానికి చెందిన పొన్నుస్వామి శరత్ (19), చిన్నరాజి పచ్చయప్పన్ (20), నడిపయ్యాన్ మణి (50)లను అరెస్టు చేశారు. వీరి నుంచి 22 ఎర్రచందనం దుంగలు లభించాయి. రేణిగుంట మండలం కరకంబాడి రోడ్డులోని మామండూరు వద్ద ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ ఆలీ భాషా కూంబింగ్ చేస్తుండగా, టాటా ఇండికా కారు కనిపించింది. దానికి డ్రైవరు, యజమాని ఎవరూ లేకపోవడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన కార్లకు ఏపి నెంబర్లు వేసుకుని ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలుసుకున్నారు. ఈ కేసులను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషనులో నమోదు చేయగా, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రఫీ విచారిస్తున్నారు. దాదాపు టన్నుకు పైగా ఉన్న ఎర్రచందనం దుంగలు విలువ రూ. 50 లక్షలకు పైగా ఉంటుందని డిఎస్పి చెంచుబాబు తెలిపారు.



## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వి.కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త**

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి యువరాజు పేర్కొన్నారు. గురువారం కృష్ణాపురం ఆర్‌బికెలో రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పాలవెల్లువ పథకంలో రైతులకు అధికంగా పాల ధరలు వచ్చేలా కార్యక్రమంలో వైస్‌ఎంపిపి తమీమ్, సచివాలయ కన్వీనర్ కిషోర్, సర్పంచ్ రమేష్, ఎంపిటిసి నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబు, పశువైద్యులు జయశ్రీ, పావని, కార్యదర్శి సోమశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటిసికి మాతృవియోగం

**వి.కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త** వి.కోట మాజీ జడ్పీటిసి, తెదేపా సీనియర్ నేత రామచంద్రనాయుడు తల్లి అశోకమ్మ మృతి చెందారు. ఈమె మృతి పట్ల వి.కోట ఉప సర్పంచ్ అక్మల్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబంకు సానుభూతి తెలిపారు. అలాగే పలువురు తెదేపా నేతలు సైతం నివాళులు అర్పించారు.

## పనుల్లో బద్దకం చూపొద్దు..ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

– డ్వామా పి.డి. గంగాభవాని



***కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త*** ఉపాధిహామీ పథకం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు బద్దకం చూపవద్దని డ్వామా పిడి గంగాభవాని ఆదేశించారు. గురువారం మండల స్థాయి ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధికూలీల సంఖ్యను వారంకల్లా మూడు వేలకు పెంచాలని సూచించారు. ఉపాధి అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులు చూడాలని కళ్ల మూసుకుపనిచేయరాదని హెచ్చరాదని హెచ్చరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో పలుచోట్ల ఉపాధి కూలీలకు పేమెంట్లు ఇవ్వలేదని, మరికొన్ని చోట్ల మస్టర్లలో గైర్హాజరు, సంతకాలు లేకుండానే చూపి పేమెంట్లు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గృహ నిర్మాణంకు గాను తక్కువ పనిదినాలకే అధికపనిదినాలు బిల్లులు చెల్లించినట్లు తేల్చారు. దాదాపు 15 ఎకరాల్లో రైతులు సాగు చేసిన పూల తోటలు, మొక్కలు చనిపోయాయన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రికార్డులు ఇవ్వలేదన్నారు. కాగా ఉపాధిహామీ పనుల్లో భాగంగా అత్యధిక పనులు చేపట్టిన పంచాయతీరాజ్ శాఖ తరపున గతంలో పనులు చేయించిన అధికారులు ఎవరూ సభకు రాకపోవడం గమనార్హం. ఈ అధికారులు ఎందుకు సమావేశానికి రాలేదని ఎంపిడిఓ జానకమ్మ అధికారులను ఫోన్‌లో వాకబు చేశారు. గ్రామాల్లో రోజ్‌గార్ దివస్ ఏర్పాటు, పనులు జరిగే చోట మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపిడిఓ జానకమ్మ, ఎస్ఆర్‌పి రాజు, ఎపిఓ హరినాథ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

**శాంతిపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త** స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో కుప్పం హిండాల్కో సంస్థ వారు జాబ్ మేళా నిర్వహించారు. 35మంది విద్యార్థులు హాజరు కాగా 12మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ విమల, ప్రిన్సిపాల్ నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై గొంతు తెరుస్తారా..

**శాంతిపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త** మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులు శుక్రవారం జరిగే మండల మీట్‌లో గొంతు తెరుస్తారా అని జనం ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లో వీధి లైట్లు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు నెలకొన్నాయి. అయితే సమావేశంలో ఈ అంశాలపై చర్చ జరుగుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు. ఇక సమావేశానికి సభ్యులు, ఇతర ప్రోటోకాల్ ప్రజాప్రతినిధులు మాత్రమే రావాల్సి ఉండగా ఎవరుపడితేవారు వచ్చి మాట్లాడడంపై అధికారులే తలలుపట్టుకుంటున్నారు. అధికార పార్టీలో వార్డు సభ్యుడు మొదలు ఇతర వ్యక్తులు సైతం హాజరవుతున్నారు. ఈ విషయంగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. కాగా మండల మీట్‌కు ఇతర వ్యక్తులు రాకుండా చూడడంలో ఎంపిడిఓ విఫలమయ్యారని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఎంపిడిఓ ఎలా స్పందిస్తారో చూడాలి.

## వార్డు ఎన్నికలకు తొమ్మిది నామినేషన్లు

**శాంతిపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త** మండలంలోని కడపల్లి, దండికుప్పం, మఠం పంచాయతీల్లో ఎన్నికలు జరగాల్సిన వార్డులకు గాను మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. కడపల్లి వార్డుకు 5, మఠంవార్డుకు3, దండికుప్పం వార్డుకు 1 నామినేషన్ దాఖలైంది. శుక్రవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనే లక్ష్యం - తెలుగుయువత నేతలు

**రామకుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త** తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధనే తమ లక్ష్యమని తెలుగుయువత నేతలు పేర్కొన్నారు. మండలంలోని ఉన్సిగానిపల్లి, కుర్లపల్లి,ఆనిగానూరు, బళ్ల గ్రామాల్లో సైకిల్ యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా గ్రామాల్లో యువతకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, కో ఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్,రాష్ట్ర తెలుగుయువత సభ్యుడు మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షులుసుబ్బు,విశ్వనాథ్,సుబ్రమణ్యం,నేతలు ఆనందరెడ్డి, మునస్వామి, సాంబశివం, రాజే ంద్ర, స్థానిక నేతలు పాల్గొన్నారు. కాగా రామకుప్పం మండలంలో ఐదురోజుల పాటు సైకిల్ యాత్ర

## వార్డు సభ్యుడిగా నామినేషన్ దాఖలు

**పాలసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం పంచాయతీ 10వ వార్డు సభ్యుడిగా ఎండి పవన్‌కళ్యాణ్ నామినేషన్ దాఖలు చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎలక్షన్ ఆఫీసర్, ఎఇ విద్యావతి, ఇఓఆర్డీ రమేష్‌లకు పవన్‌కళ్యాన్ నామినేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు,నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి అరుళ్‌నాధన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, మండల పార్టీ కోశాధికారివిజయకుమార్,నియోజకవర్గకార్యనిర్వాహన కార్యదర్శి తంగరాజు పాల్గొన్నా రు.

## నీటి తొట్టెలను శుభ్రం చేసిన పంచాయతీ అధికారులు

'వార్త'కు స్పందన



**పాలసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో 'ఉపాధి నిధులు వృధా' పశువుల దాహార్తి తీర్చదానికి ఏర్పాటు చేసిన తొట్టెలు నిరుపయోగం' అనే శీర్షికతో 'ప్రభాతవార్త'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణలు స్పందించి చెత్త నీరు, రాళ్ళు రప్పలు, మట్టి, పాచితో వున్న తొట్టెలను శుభ్రం చేసి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీకి నివేదిక పంపారు. పశువుల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన తొట్టెలు గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా వుండటంతో ఈ విషయంను 'ప్రభాతవార్త' ప్రచురించడం, అధికారులు స్పందించి తొట్టెలను శుభ్రం చేయడంతో స్థానిక ప్రజలు హర్షం తెలిపారు.

## రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గ్యారెంటీగా నిలుస్తారని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తంబిగానిపల్లిలో మహాశక్తి పథకం ప్రచారాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహాశక్తి పథకంలో భాగంగా 18-50ఏళ్ల మహిళలకు ప్రతినెలా 1500రూ.లు అందిసా్తమన్నారు. అలాగే తల్లికివందనం పేరిట ప్రతి ఇంట్లో చదివే పిల్లలకు ఒక్కొక్కరికి ఏటా రూ 15వేలు, ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. నిత్యావసరాల ధరలు తగ్గించి పేదలకు సంక్షేమ పాలనను చంద్రబాబు అందిస్తారన్నారు. ఈసందర్భంగా మహిళలకు పసుపు,కుంకుమ,వస్త్రం అందించి మహాశక్తి పథకం గురించి వివరించారు.రాష్ట్ర నేతలు గోపీనాథ్, కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు సెల్వరాజ్, జాకీర్, నేతలు సురేష్‌కుమార్,నాగే ంద్ర,ప్రతాప్‌కుమార్,వేణు, సతీష్, నరేష్, శారదమ్మ, తిరుమగళ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## హంసాపురంలో సర్పంచ్ చొరవతో తీరిన నీటి సమస్య



**కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త**

మండలంలోని నడిమూరు పంచాయతీ హంసాపురంలో సర్పంచ్ చొరవతో మంచినీటి సమస్య తీరింది. గ్రామంలో కొంతకాలంగా ప్రజలు తాగునీటికి అవస్థలు పడేవారు. దీంతో సర్పంచ్ మాదమ్మ సంతోష్ స్పందించి గ్రామంలో ఉన్న బోరుకు నూతన మోటారు బిగించి మంచినీరు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు సర్పంచ్‌ను అభినందించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

## నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత



**కుప్పంరూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త**

పిల్లల కడుపులో నులిపురుగులు ఉంటే రక్తహీనతకు గురవుతారని కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు డా॥ సుభాష్ రాజ్, డా॥ అనూష పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లి పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాల సరస్వతి, ఎఎన్ఎం కోమల, మోహన, ఎంఎల్‌హెచ్‌పి స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెక్కునత్తంలో ఓటర్ల పరిశీలన కార్యక్రమం



**కుప్పంరూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త**

మండలంలోని చెక్కునత్తం పంచాయతీ 228బూత్ పరిధిలో గురువారం బూత్ లెవెల్ అధికారి దాము అధ్వర్యంలో ఓటర్ల పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా చనిపోయిన వారివి, కొత్తగా చేర్చే ఓటర్ల

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## విశ్రాంతి జవాన్‌లకు ఘన సన్మానం

**వెదురుకుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త :**

ఆజాదీక అమృత మహోత్సవంలో భాగంగా గురువారం సంతబయలులో విశ్రాంతి జవాన్లకు ఘనంగా సన్మానం చేశారు. మండలంలోనిసంతబయలు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఆజాదీక అమృత మహోత్సవ కార్యక్రమంను సర్పంచ్ రాజేశ్వరీ పెద్దిరెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రాధాన్యతను, భారతీయ పౌరులుగా మన బాధ్యతను వివరించారు. అనంతరం చవటగుంటకు చెందిన బండి పరమేశ్వర్ రెడ్డి, సంతబయలు గ్రామంకు చెందిన సుబ్రమణ్యం రెడ్డిలను సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. విశ్రాంతి జవానులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో బండి ప్రభాకర్ రెడ్డి, జానేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 8,224 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ



**తవణంపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని 8,224 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డిలు ప్రారంభించారు. మండలంలోని ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నతపాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లోని 1 నుండి 19 ఏళ్ళు లోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ దాత్రేయ చౌదరి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, తవణంపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీరంజనీ, వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి ఆవు దూడ విరాళం

**కాణిపాకం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు గురువారం దేశీయావు, దూడను విరాళంగా అందజేశారు. అలాగే గోసంరక్షణ ట్రస్ట్‌కు 50,116 రూపాయలను విరాళంగా అందజేశారు. చిత్తూరుకు చెందిన పి.సుబ్బరాజన్ అనే భక్తుడు దేశీయ ఆవును, దూడను విరాళంగా అందజేశారు. దాత కుటుంబసభ్యులతో కలసి ఆవు, దూడతో పాటు విరాళ మొత్తాన్ని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కలి ్పంచి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో కడప ఎమ్మెల్సీ

**కాణిపాకం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

కడప ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కుటుంబసమేతంగా గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపు ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశం గౌరవించేలా కార్యక్రమాలు

**పాలసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

దేశం గౌరవించేలా నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు, జడ్పీటిసీ అన్బుగలన్‌లు పిలుపునిచ్చారు. పాలసముద్రం మండలం పాలసముద్రం పంచాయతీ పరిధిలోని రాచపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నాభూమి-నాదేశం కార్యక్రమ శిలాఫలకాలను వీరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటిసీ అన్బుగలన్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరు మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు ఆగస్టు 30వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని, ఈ సందర్భంగా నాటే ప్రతి మొక్కను సంరక్షించి వాతావరణ కాలుష్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు బాబు, ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, సర్పంచ్ అయ్యప్పన్, వైస్ సర్పంచ్ సుమన్‌రాజు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ అనూష, సీనియర్ వైకాపా నాయకులు సుందర్‌రాజు, చందర్‌రాజు, ఎంపిటీసీ గోవిందరాజులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేదల భూములను దౌర్జన్యంగా లాక్కుంటున్నారు



– విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

**బాలాయపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

పేదల భూములను కొందరు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ ఆందోళన చెందారు. తడ నుంచి ఇచ్చాపురం వరకు విజయ్‌కుమార్ నిర్వహిస్తున్న ఐక్యత విజయం పాదయాత్ర బాలాయపల్లి మండలం అంబలపూడి, యాచవరం, బాలాయపల్లి గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నెల్లూరులో మహిళా సదస్సు ను పెట్టుకున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత అవసరమని తెలిపారు. పేదలకు నేటికీ అన్యాయం జరుగుతున్నట్లుచెప్పారు. ఐక్యత సాధించేందుకే తాను పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గోపి, విజయశ్రీ పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తులకే ప్రాధాన్యత



– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

అక్టోబర్ నెల 4, 5 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వి.బి.సాయికృష్ణయాచేంద్ర తెలిపారు. పోలేరమ్మ జాతర నిర్వహణపై ఇరువురు చర్చించారు. శాంతి సంఘం సమావేశం వినాయక చవితి వెళ్లిన తరువాత జాతర నిర్వహణపై చర్చించారు. గతంలో భక్తులు ఇబ్బంది పడ్డారని, ఈసారి సామాన్య భక్తుల దర్శనానికి ప్రత్యేక ప్రార్థనలు చేయాలని నిర్ణయించారు. ఇంకా పలు అంశాలను ఇరువురు చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్‌ను సాయికృష్ణకు రామ్‌కుమార్‌రెడ్డి అందించారు. ఆయన వెంట కౌన్సిలర్లు విజయలక్ష్మి, వహీదా, నాయకులు బ్రహ్మయ్య, రామయ్య, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రజలను మోసం చేసే విషయంలో దిట్ట

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



మాజీ సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉండగా ప్రజలకు ఎన్నో ఆశలు చూపి మోసం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 19వ వార్డు జట్టిపాళెం, బలిజపాళెం ప్రాంతాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎన్నో ఆశలు చెప్పి మోసం చేశాడన్నారు. గృహాలు మంజూరైనట్లు ఖాతాలో రూపాయి వేసి మంజూరు చేయలేదని తెలిపారు. అనేక రకాలుగా ప్రజలను మాజీ సీఎం చంద్రబాబునాయుడు మోసం చేశారని విమర్శించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన హామీలను కొన్ని పథకాలను కొత్తగా అమలు చేశారని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, కౌన్సిలర్ విజయలక్ష్మి, వహీదా, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, కమిషనర్ వెంకటరామయ్య,నాయకులుబ్రహ్మయ్య,రామయ్య,మురళీకృష్ణ,సతీష్, యస్థానీ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు వెళ్లి వైసీపీ వారు ఏమి సాధించామని చెప్తారు

– మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం 20వ వార్డు నాగులగుంటపాళెంలో మాజీ ఎమ్మెల్యే మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైసీపీ నాయకులు ఏమి సాధించారని ప్రజలకు చెప్తారని ప్రశ్నించారు. వెంకటగిరి పట్టణంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి తప్ప ఎలాంటి పనులు జరగలేదన్నారు. వెంకటగిరి పట్టణంలోని అన్ని వీధుల్లో తాను రోడ్లు వేశానని, ఎన్నో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు గంగాధర్, నాయకులు విశ్వనాథం, ఆనంద్, సుధాకర్, చెంగారావు తదితరులు ఉన్నారు.

## వైసీపీ సర్పంచు అభ్యర్థిగా వేణుగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు

**వెంకటగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

మండలంలోని పాళెంకోట సర్పంచు వైసీపీ బలపరచిన అభ్యర్థిగా వేణుగోపాల్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌వో జగదీష్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. పాళెంకోట సర్పంచ్ గంగిరెడ్డి మృతి చెందడంతో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. మృతి చెందిన సర్పంచు గంగిరెడ్డి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి సర్పంచు బరిలోకి దిగారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి,నాయకులుసదాశివరెడ్డి,రాజా,తిరుమలేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏడవ వార్డుకు రెండు నామినేషన్ దాఖలు

**వాకాడు, ఆగస్టు 10, ప్రభాతవార్త**



వాకాడు మండలం కొండాపురం పంచాయితీలోని ఏడవ వార్డుకు రెండు నామినేషన్ దాఖలు అయినట్లు ఆర్డబ్ల్యూఎస్ఏఈ, ఎన్నికల అధికారి అరవింద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొండాపురం పంచాయితీ గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి పార్టీ మద్దతులో మల్లి గిరిజ, అదే గ్రామానికి చెందిన టిడిపి మద్దతులో చెమిర్తి సంధ్య నామినేషన్లు దాఖలు చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గోపినాధ్, వాకాడు సొసైటీ అధ్యక్షులు దామోధర్ రెడ్డి, సుధాకర్ నాయుడు, మారుబోయిన రత్న గౌడు, టిడిపి నాయకులు, టిడిపి మండల పార్టీ కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, దోసకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాస్ రెడ్డి, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌కుమార్‌రెడ్డి చొరవతోనే జాతరకు రాష్ట్ర పండుగ గుర్తింపు

– జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద



**వెంకటగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చొరవతో జాతరను రాష్ట్ర పండుగగా సీఎం జగన్మోహన్‌రెడ్డి గుర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు 8వ వార్డు క్రాస్ రోడ్డు వద్ద మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాలయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పోలేరమ్మ జాతర ఎంతో చరిత్ర కలిగిందని తెలిపారు. 2024 సంవత్సరం ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందన్నారు. ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ మాట్లాడుతూ పోలేరమ్మ కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా గుర్తింపు పొందిందన్నారు. అమ్మవారి జాతరను రామ్‌కుమార్‌రెడ్డి సీఎంతో చెప్పి రాష్ట్ర పండుగ గుర్తింపు తెచ్చారన్నారు.వైస్‌ఛైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు వహీదా, విజయలక్ష్మి, గోపాలకృష్ణ, సుబ్బారావు, ఢిల్లీ బాబు, శంకరయ్య, మాద జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలి

– సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులు డిమాండ్

**కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల కోసం కేటాయించిన నివేశన స్థలాల్లో త్వరితగతిన పక్కాగృహాల నిర్మాణాన్ని చేపట్టాలని కోట బిట్-2 ఎంపిటిసి షేక్ మొబిన్‌బాషా గృహ నిర్మాణశాఖ అధికారులను కోరారు. గురువారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార వైసీపీ ఎంపిటిసి షేక్ మొబిన్‌బాషా మాట్లాడుతూ మండలంలోని ఊనుగుంటపాలెం వద్ద పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పేదలందరికీ వెంటనే పక్కాగృహాలు నిర్మించాలని హౌసింగ్ ఏఇని కోరారు. గూడూరు తర్వాత అతి పెద్ద మండలమైన కోటలో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంపై అధికారులను నిలదీశారు. హౌసింగ్ ఏఇ సమాధానమిస్తూ మండలంలో 1500 ఇంటి పట్టాలు పేదలకు మంజూరు చేశారని, అందులో 295 మందికి అనుమతులు లభించాయని తెలిపారు. ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ నివేశన స్థలాల కోసం 24 లేఅవుట్లు నిర్మించి ఉన్నామని, అందులో 14 చోట్ల గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం టిడిపి ఎంపిటిసి షంషుద్దీన్ మాట్లాడుతూ అన్ని వసతులు ఉండి నివాస యోగ్యమైన ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో తాము డిమాండ్ చేశామని, తమ సూచనలు సలహాలను అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ హేమంత్ వారి శాఖలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి కోటయ్య, విద్యాశాఖ అధికారి మస్తానయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణం కాపాడండి

**వాకాడు, ఆగస్టు 10, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణం కాపాడాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి అన్నారు. దేశం నాభూమి కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణంలోని 75 మొక్కలు నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు దేశం స్వచ్ఛంగా ఉండాలని అన్నారు. గూడూరు డిఎల్‌డిఓ వాణి రెడ్డి, ఎంపిడిఓ గోపినాథ్, ఎనర్జీ ఎస్ ఏపిఓ విజయ, ఉపాధి హామీ సిబ్బంది పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగులను నులిమేద్దాం



**కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త**

పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోట మండలం చిట్టేడు ఉప ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. గురువారం చిట్టేడు హైస్కూలులో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు నులి పురుగుల బారిన పడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. దీని వల్ల పోషకాహార లోపం ఏర్పడుతుందని, అంతేకాకుండా రక్తహీనత, ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. మంచి ఆరోగ్యంగా ఉండాలంటే ఆల్బెండజోల్ మాత్ర 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలు వేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలల్లో 9500 మాత్రమే పంపిణీ చేశామన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

## మళ్లీ జగనన్నను ఆశీర్వదించండి

**దొరవారిసత్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త**

మళ్లీ జగనన్నను సీఎంగా, కిలివేటి సంజీవయ్యను సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి అన్నారు. గురువారం దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని కృష్ణాపురం, ఎన్ఎం అగ్రహారం, అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, సూరపు అగ్రహారం, గొల్లపాలెం, ముత్తరాశిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే సంజీవయ్యకు, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డికి యువత, నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దొరవారిసత్రంలో దువ్వూరు బాలచంద్రారెడ్డికి మరొకరు సాటిలేరని నినాదాలు చేశారు. అక్కరపాక గ్రామంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గోపిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కన్నెమ్మ, ఎంపిడిఓ శింగయ్య, ఎస్ఐ జె.తిరుమలరావు, జడ్పిటిసి టి.రమేష్, నాయకులు పురుషోత్తం, గోవిందు, బాబు, సుధాకర్, సురేష్‌రెడ్డి, రమణయ్య, చెంగయ్య, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్



**చిల్లకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త**

నులిపురువల నివారణే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భారత దేశంలో ఎక్కడ జరగని విధంగా మన రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, పాఠశాలలకు అధునాతనమైన వసతులను కల్పించారన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదే విధంగా విద్యార్థుల చదువు కోసం వేల కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు భాగా చదువుకుని ఉన్నత స్థాయి ఎదగాలని వారిని దీవించారు. పాఠశాలలో మిని ఆడిటోరియాన్ని ఎమ్మెల్యే సొంత నిధులు 15 లక్షలతో ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. అదే విధంగా తూర్పు కనుపూరు గ్రామంలో ఏర్పాటైన నవనీత ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో హెచ్ఎం సిఖా శ్యామ్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగులు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసి మన్యం శీనయ్య, ఎంపిటిసి పాలూరు మాధవి, సర్పంచ్ జోగి సుగుణమ్మ, వైద్యులు పాల్ జేమ్స్సన్, పావని, సిపిఐ దశరధరామారావు, నాయకులు ఎదనపర్తి మనోజ్ కుమార్ రెడ్డి, దువ్వూరు చిరంజీవి రెడ్డి, పాఠశాల హెచ్ఎం శివసుబ్రమణ్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత లోపాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**చిల్లకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త**

మండలంలోని చింతవరం గ్రామంలో నూతనంగా 2 కోట్ల రూపాయిలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుత్తేదారులు నిర్మాణంలో నాణ్యత లేదని ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కి, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందని వారి ఫిర్యాదు మేరకు ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలించడానికి ఎమ్మెల్యే రావడం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ తల్లిని ఓదార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మన్యం శ్రీనయ్య, ఎంపిటిసి పాలూరు మాధవి, సర్పంచ్ జోగి సుగుణమ్మ, వైద్యులు పాల్ జేమ్స్సన్, పావని, దశరధరామారావుతో పాటు గ్రామస్తులు గోపాల్, సురేష్, సాయి, మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

